ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



జగిత్యాల

జిల్లా వార్తలు

5★★

మంగళవారం 11 జూన్ 2024

వడ్డీలేని రుణాలు అన్నదాతకు అందని ద్రాక్షేనా..? 8లో..

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి 8లో..

కొనలేం..తినలేం

- ఆకాశాన్నంటుతున్న కూరగాయల ధరలు...
- నెల రోజుల్లో రెట్టింపు
- పెరిగిన వ్యయంతో సామాన్య జనం తిప్పలు



జగిత్యాల, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): కూరగాయల ధరలకు అడ్డూ అదుపూ లేకుండా పోతోంది. మొన్నటికి మొన్న ఉన్నదానికంటే ధరలు రెట్టింపు కావడంతో 'ఏం కొనెట్టు లేము... ఏం తినెట్టు లేము' అన్న పరిస్థితిని సామాన్య ప్రజలు ఎదుర్కోవాల్సి వస్తోంది. రోజురోజుకి పెరిగిపోతున్న కూరగాయల ధరలతో సామాన్య జనం ఉక్కిరిబిక్కిర వుతున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా కూరగాయలు ధరలు పెరిగి భగ్గుమంటుండడంతో ప్రజలు వాటిని కొనలేని పరిస్థితితో కొట్టుమిట్టాడుతున్నారు. విక్రయదారుల కు సైతం గిరాకీలు లేక నిరాశలో ఉంటున్నారు. జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి, ధర్మపురి, రాయికల్ పట్ణాలతో పాటు ఇతర ప్రాంతాల్లో సైతం కూరగాయల మార్కెట్‌లో కూరగాయలు ధరలు పైపైకి వెళ్తుండడంతో ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. గతంలో కిలో చొప్పున కొనుగోలు చేసిన కూరగాయలను ప్రస్తుతం అర కిలో కొనడానికి ప్రజలు నిరాసక్తి కనబరుస్తున్నారు.



బహిరంగ మార్కెట్‌లో డబుల్...

పదిది ఇరవై రూపాయలు... ఇరవైది నలభై రూపాయలు... నలభై కాస్త ఎనభైరూపాయలు... ఇదీ జగిత్యాల జిల్లాలోని పలు కూర గాయల మార్కెట్‌లలోని కూరగాయల ధరల పరిస్థితి. కేవలం సుమారు నెల రోజుల్లోనే ధరలు రెట్టింపు కావడంతో సామాన్య ప్రజల పరిస్థితి ఎలా ఉంటుందో వేరే చెప్పనక్కర్లేదు.

జిల్లాలో కిలో కూరగాయలు కొనాలంటే యాభై నుంచి వంద రూపాయలు చెల్లించాల్సిన పరిస్థితి దాపురించింది. పచ్చిమిర్చి నుంచి పాలకూర వరకు, ఉల్లిపాయల నుంచి ఎల్లిపాయల వరకు ఇలా ఏ కూరగాయలు కొనాలన్నా జేబులు గుల్లా చేసుకోవాల్సిందే. మొన్నటి వరకు కిలో చొప్పున టమాట రూ. 30 ఉండగా ప్రస్తుతం రూ.60కి పెరిగింది. చింతపండు పాత ధర రూ. 90, కొత్త ధర రూ. 120, క్యాప్సికం (దొడ్డుమిర్చి) పాతది రూ. 60, కొత్త ధర రూ. 80, బీరకాయ పాతది రూ. 60, కొత్త ధర రూ. 80, క్యారెట్ పాతది రూ. 60, కొత్త ధర రూ. 80, దొండకాయ పాతది రూ. 40 ఉండగా కొత్త ధర రూ. 60, వెల్లుల్లి పాతది రూ. 90, కొత్త ధర రూ. 120, ఉల్లిగడ్డ పాత ధర రూ. 30, కొత్తది రూ. 40, ఆలుగడ్డ పాతది రూ. 30, కొత్త ధర రూ. 40, చిక్కుడు పాత ధర రూ. 80, కొత్త ధర రూ. 120లు, పచ్చిమిర్చి పాత ధర రూ. 60 ఉండగా కొత్త ధర రూ. 80, వంకాయ పాతది రూ. 30 ఉండగా కొత్త ధర రూ. 40 చొప్పున ధరలు మండిపోతున్నాయి. ఇవి కాకుండా బెండకాయ రూ. 40లు, గోరు చిక్కుడు రూ. 40లు, సోరకాయ ఒక్కంటికి రూ. 20లు, పాలకూర రూ.40లు, బీట్‌రూట్ రూ. 50లు, తోటకూర రూ. 30, చుక్క కూర రూ. 40, అల్లం రూ. 100, బీన్స్ రూ. 150 చొప్పున విక్రయిస్తున్నారు.

ఇతర ప్రాంతాల నుంచి తెచ్చి...

జిల్లాలోని మార్కెట్‌లకు ఇతర ప్రాంతాల నుంచి పలువురు హోల్‌సెల్ వ్యాపారులు కూరగాయలు తీసుకొచ్చి అధిక ధరలకు విక్రయిస్తున్నారు. నిజామాబాద్, కరీంనగర్, కామారెడ్డి, నిర్మల్, మంచిర్యాల జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి పలు కూరగాయలను ప్రతి నిత్యం తీసుకవస్తున్నారు. జిల్లాలోని పలు ప్రాంతాల్లో భూగర్భ జలాలు తగ్గడం, సాగు నీటి వసతి, ఇతర కారణాల వల్ల కూరగాయలను పండించేందుకు రైతులు సుముఖత కనబరచడం లేదు. పాలకూర, తోటకూర, కొత్తిమీర, మెంతి కూర తదితర ఆకు కూరలు బోరు మోటార్ల నుంచి నీరు అందక ఎండిపోతున్నాయని అంటున్నారు. దీంతో ఆకు కూరలు మార్కెట్ రాక ధరలు పెరిగాయని విక్రయదారులు చెబుతున్నారు.

ధరలు పెరగడంతో ఆర్థిక ఇబ్బందులు

అడిగొప్పుల రజిని, గృహిణి



ప్రస్తుతం మార్కెట్‌లో కూరగాయల ధరలు పెరగడంతో ఆర్థిక ఇబ్బందులు పడాల్సి వస్తోంది. గతంలో కంటే ప్రస్తుతం కూర గాయల ధరలు మండిపోతున్నాయి. సామాన్యులకు అందుబాటులో ధరలు ఉండడం లేదు. నెల రోజులకు ఇప్పటికీ ధరలు విపరీతంగా పెరిగాయి.

ధరలను ప్రభుత్వం నియంత్రించాలి

: కంబ శంకర్, యువకుడు, జగిత్యాల జిల్లా



పెరుగుతున్న కూరగాయల ధరలను ప్రభుత్వం నియంత్రించాలి. ధరలు పెరుగు తుండడం వల్ల పేద, మధ్య తరగతి ప్రజలు నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కుటుంబ అవసరాలకు తగ్గట్టుగా కూరగాయల కొనాలంటే జంకుతున్నారు. అవసరమైన దాని కంటే కొంత తగ్గించుకొని కొనుగోలు చేస్తున్నారు.

ప్రజావాణి సమస్యలు సత్వరమే పరిష్కరించాలి

కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా



ప్రజావాణిలో దరఖాస్తులను స్వీకరిస్తున్న కలెక్టర్, ఇతర అధికారులు

జగిత్యాల, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణి సమస్యలను సంబంధిత శాఖ అధికారులు సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా ఆదేశించారు. సోమవారం పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమానికి కలెక్టర్, అదనపు కలెక్టర్లు రాంబాబు, దివాకర హాజరై జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. వివిధ సమస్యలపై ప్రజల నుంచి 48 దరఖాస్తులను స్వీకరించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వివిధ ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులు ఆన్‌లైన్‌లోని తమ తమ లాగిన్‌లో గల ప్రజావాణి దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించి నివేదిక అందించాలన్నారు. వ్యయ ప్రయాసలకు ఓర్చుకొని పలువురు బాధితులు జిల్లాకేంద్రానికి వచ్చి ప్రజావాణిలో దరఖాస్తులు సమర్పిస్తున్నారని తెలిపారు. సమస్యలు పరిష్కరించకుంటే నిరుత్సాహానికి గురికావడంతో పాటు పలు ఇబ్బందులు ఎదుర్కొంటారన్నారు. ప్రజలకు ప్రభుత్వంపై భరోసా కల్పించే విధంగా చర్యలు తీసుకొని సమాచారం తెలియజేయాలని ఆదేశించారు. శాశ్వత పరిష్కార దిశగా జవాబు అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డీవోలు మధుసుదన్, శ్రీనివాస్, వివిధ ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంగా ఏర్పడ్డ పూర్వ విద్యార్థులు

రాయికల్, జూన్ 10: మండలంలోని అల్లీపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1990-91 విద్యా సంవత్సరంలో 10వ తరగతి పూర్తి చేసుకున్న పూర్వ విద్యార్థులు సోమవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఒకరికొకరు పాత జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ ఆనందంగా గడిపారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం సహపంక్తి భోజనం చేసి ఆట పాటలతో ఉల్లాసంగా గడిపారు. వారు చదువుకున్న పాఠశాలలో గుర్తుగా మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు గంగారాం, రహీం, మురళీ మనోహర్, శ్యాంసుందర్ పాల్గొన్నారు.

పొలస్తేశ్వర ఆలయ భూముల కౌలుకు బహిరంగవేలం

జగిత్యాలరూరల్, జూన్ 10 : జగిత్యాల రూరల్ మండలంలోని పొలాస పౌలస్తేశ్వర ఆలయ భూములు రెండు సంవత్సరాలపాటు కౌలు కోసం ఈనెల 13న ఉదయం 11 గంటలకు ఆలయ ప్రాంగణంలో బహిరంగ వేలం నిర్వహిస్తామని ఆలయ ఈవో ఆర్. రవికిషన్ తెలిపారు. ఆసక్తి గల వారు సర్వేనంబర్.. 342బై1లో గల 7-18 గుంటలకు గాను రూపాయలు 50వేలు ధరావత్తు సొమ్ము చెల్లించాలని, 359, 368 సర్వేనంబర్లలోని 18-32 గుంటల కోసం రూపాయలు 25 వేలు ధరావత్తు సొమ్మును చెల్లించి పేరును నమోదు చేసుకోవాలని ఈవో తెలిపారు. బహిరంగవేలంలో పాల్గొనువారు ఆధార్ కార్డుజిరాక్స్, బ్యాంక్ అడ్వాన్స్ చెక్కును వెంట తీసుకొని రావాలని కోరారు.

ఆయిల్ పాం సాగుపై రేపు అవగాహన

జగిత్యాల అగ్రికల్చర్, జూన్ 10: జిల్లాలో ఆయిల్ పామ్ సాగు చేసే రైతులకు ఈ నెల 12న పట్టణంలోని స్థానిక వీకేబీ ఫంక్షన్ హాల్‌లో అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉద్యానవన అధికారి ప్రతాప్‌సింగ్ తెలిపారు. ఈ అవగాహన సదస్సుకు ఫ్రాన్స్, ఇండోనేషియా, మలేషియా దేశాల నుంచి ఆయిల్ పామ్ శాస్త్రవేత్తలు హాజరవుతున్నారన్నారు. సలహాలు సూచనలు పొందే అవకాశం ఉన్నందున జిల్లాలోని రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నిబంధనలకు విరుద్ధంగా ప్లాస్టిక్ వాడితే చర్యలు

కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా



స్టీలు వాటర్ బాటిళ్లతో జిల్లా కలెక్టర్, ఇతర విభాగాల జిల్లా స్థాయి అధికారులు

జగిత్యాల, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): నిబంధనలకు విరుద్ధంగా ప్లాస్టిక్ వాడితే చర్యలు తప్పవని కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా అన్నారు. సోమవారం పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా పంచాయతీ అధికారి దేవరాజు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టీల్ వాటర్ బాటిళ్లను వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన జిల్లా స్థాయి అధికారులకు కలెక్టర్ పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడారు. జిల్లాలో దశల వారీగా ప్లాస్టిక్ నిషేదం చేయాలని, కార్యాలయాలు, వ్యాపార సముదాయాలులో సింగిల్ ప్లాస్టిక్ నిర్మూలించాలని తెలిపారు. గ్రామాలు, పట్టణాల్లోని స్వయం సహాయక మహిళా సంఘాల సభ్యులకు, ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. గ్రామాల్లో అవసరమయితే దండోరా వేయించాలని, ఫ్లెక్సీల ద్వారా, కరపత్రాల ద్వారా ప్రచారాలు చేయాలన్నారు. ప్లాస్టిక్ వాటర్ బాటిళ్లకు బదులుగా ప్రభుత్వ కార్యాలయాల్లో విధిగా స్టీల్ వాటర్ బాటిళ్లను వినియోగించాలన్నారు. వానాకాలం సీజన్ సమయంలో రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు అవసరం మేరకు జిల్లాలో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కొందరు సహకార సంఘాల ఉద్యోగులు, విత్తన డీలర్లు, డీసీఎంఎస్ కేంద్రాల నిర్వాహకులు ఉద్దేశ పూర్వకంగా విత్తన కొరత ప్రచారం చేస్తున్నారని ఫిర్యాదులు వస్తున్నాయని అన్నారు. ఎవరైనా అసత్య ప్రచారాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవన్నారు. పాఠశాలల పునః ప్రారంభం అవుతున్న నేపథ్యంలో విద్యార్థులకు కనీస సదుపాయాలు కల్పించడం, పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలు, యూనిఫాం అందించడం జరగాలని ఆదేశించారు. అదేవిధంగా వసతి గృహాల్లో కూడా పరిశుభ్రత పాటించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు రాంబాబు, దివాకర, ఆర్‌డీఓలు మధుసుదన్, శ్రీనివాస్, జిల్లా పంచాయతీ అధికారి దేవరాజు, జిల్లా వ్యవసాయ అధికారిణి వాణి, డీఈవో జగన్ మోహన్ రెడ్డి, మెప్మా ఏవో శ్రీనివాస్, జిల్లా గృహ నిర్మాణ శాఖ అధికారి రాజేశ్వర్, పీడీ లక్ష్మీనారాయణ, బీసీ, మైనార్టీ సంక్షేమ శాఖ అధికారులు సాయిబాబ, రాజు కుమార్, జిల్లా సివిల్ సప్లయి అధికారి వెంకటేశ్వర్ రావు, సివిల్ సప్లయి డీఎం హతీరాం, వివిధ ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

స్థల ఆక్రమణపై కలెక్టర్‌కు ఫిర్యాదు

జగిత్యాల, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): నకిలీ సర్టిఫికెట్లను సృష్టించి అక్రమంగా స్థలాన్ని ఆక్రమించుకోవడానికి కొందరు ప్రయత్నిస్తున్నారని ఆరోపిస్తూ కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ దివాకరలకు జగిత్యాలకు చెందిన భాదితుడు బాలె వెంకటేశ్ ఫిర్యాదు చేశారు. సోమవారం పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో కలెక్టర్‌ను కలిసి సంబంధిత పత్రాలను జతపరిచిన ఫిర్యాదు కాపీని అందించి గోడును వెల్లబోసుకున్నారు. పట్టణంలోని పలువురు మున్సిపల్ అధికారులు, ఉద్యోగులు అవి నీతికి పాల్పడుతూ ఎలాంటి విచారణ లేకుండా ఇంటి స్థలం పరిశీలించకుండా వీఎల్‌టీ నంబర్లు, ఇంటి నంబర్లు అనర్హులకు కేటాయిస్తున్నారని ఆరోపించారు. పట్టణంలోని గాంధీ నగర్ కాలనీలో సర్వే నంబరు 1377లో గల అయిదు పావు గుంటల స్థలంలో ఎలాంటి ఇంటి నిర్మాణం లేకున్నప్పటికీ మున్సిపల్ అధికారులు వెకెంట్ ల్యాండ్ ట్యాక్స్ (వీఎల్‌టీ), ఇంటి నంబరు 4-4-222/3/ఏను వేరొకరి పేరుతో కేటాయించి స్థల కబ్జా కుట్రదారులకు సహకరించారని వివరించారు. మరొకరి స్థలాన్ని వారి స్థలంగా చూపిస్తూ ఇష్టారీతిగా ఇంటి నంబర్లు కేటాయిస్తున్నారని తెలిపారు. ఖాళీ స్థలం కనిపిస్తే చాలు అది ఎవరిదైనా సరే కబ్జా చేసి, వీఎల్‌టీ నంబరు, ఇంటి నంబరు, ఇతర పత్రాలు నకిలీ విసృష్టించి స్థల యజమానులను భయభ్రాంతులకు కొందరు గురిచేస్తున్నారని ఆరోపించారు. ఈ వ్యవహారంపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని వేడుకున్నారు. సంబంధిత ఫిర్యాదుపై సమగ్ర దర్యాప్తు చేయాల్సిందిగా మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ యాదగిరి, టీపీఎస్ తేజస్వినిలను కలెక్టర్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఆదేశించారు.

నకిలీ విత్తనాలు అమ్మితే పీడీ యాక్ట్

జిల్లా వ్యవసాయాధికారిణి వాణి



ఆగ్రోస్ రైతు సేవా కేంద్రంలో రికార్డులను తనిఖీ చేస్తున్న జిల్లా వ్యవసాయాధికారిణి

గొల్లపల్లి, జూన్ 10 : జిల్లాలో లైసెన్స్‌లు ఉన్న డీలర్లు రైతులకు నకిలీ విత్తనాలను, ఎరువులను విక్రయించిన, అధిక ధరలకు రైతులకు అంటగట్టిన సంబంధిత డీలర్ లైసెన్స్‌లను రద్దు చేయడమే కాకుండా పీడీ యాక్టులు నమోదు చేయిస్తామని జిల్లా వ్యవసాయాధికారిణి వాణి హెచ్చరించారు. సోమవారం గొల్లపల్లి మండల కేంద్రంలోని ఆగ్రోస్ రైతు సేవా కేంద్రంను, ఫర్టిలైజర్ దుకాణాల్లో ఆమె స్థానిక వ్యవసాయ అధికారిణి బొట్ల కరుణతో కలిసి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఆయా దుకాణాల్లో సేల్, స్టాక్ రిజిష్టర్‌లను, రికార్డులను తనిఖీ చేశారు. అలాగే ఎరువులు, విత్తనాల లేబుళ్లను, ఎమ్మార్పీ ధరలను పరిశీలించారు. ఆగ్రోస్ రైతు సేవా కేంద్రంలో, ఫర్టిలైజర్ దుకాణంలో వివిధ కంపెనీలకు చెందిన ఉత్పత్తులకు సంబంధించిన నిబంధనలు ఖచ్చితంగా పాటించకపోవడాన్ని గుర్తించిన వ్యవసాయ అధికారిణి సదరు డీలర్ల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిబంధనలు పాటించని డీలర్లపై శాఖాపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని, ఇలాంటివి మరోసారి పునరావృతం కావొద్దని, నిబంధనలకు విరుద్ధంగా నిర్వహించే డీలర్లు ఎంతటివారైన ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ నకిలీ విత్తనాలు, నకిలీ ఎరువుల కొనుగోళ్లలో రైతులు అప్రమత్తంగా ఉండాలని, ఎరువులు, విత్తనాల కొనుగోళ్లలో జాగ్రత్తలు పాటించాలన్నారు.

కేసీఆర్‌ను కలిసిన మాజీ మంత్రి



కేసీఆర్‌తో మాజీ మంత్రి రాజేశం గౌడ్

జగిత్యాల, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను సోమవారం మాజీ మంత్రి గొడిసెల రాజేశంగౌడ్ కలిశారు. హైద్రాబాద్‌లోని ఫాం హౌజ్‌లో కేసీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రోహన్ బాలాజీ, మోహిత్ కృష్ణ, జనగామ నాగరాజు, గుడిసెల రణదీర్ గౌడ్ పాల్గొన్నారు.

ఐఎల్‌పీఏ జాయింట్ సెక్రెటరీగా జాజాల రమేష్



ధర్మపురి, జూన్ 10: ధర్మపురి కోర్టు బార్ అసోసియేషన్‌కు చెందిన న్యాయవాది జాజాల రమేష్‌ను ఇండియన్ లీగల్ ప్రొఫెషనల్ అసోసియేషన్ (ఐఎల్‌పీఏ) జగిత్యాల జిల్లా జాయింట్ సెక్రటరీగా సోమవారం నియమించారు. ఈ మేరకు కోరుట్లలో జరిగిన సమావేశంలో స్టేట్ వైస్ ప్రెసిడెంట్ దయ్యరాజారాం, స్టేట్ మెంబర్ మెడిచెలిమెల సుమలత నూతనంగా జిల్లా కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యవర్గంలో ధర్మపురి కోర్టు బార్ అసోసియేషన్ చెందిన న్యాయవాది జాజాల రమేష్‌కు చోటు దక్కింది. ధర్మపురి మండలంలోని నేరెళ్ల గ్రామానికి చెందిన యువ న్యాయవాది రమేష్ మాట్లాడుతూ న్యాయవాదుల అభివృద్ధి కోసం కృషి చేస్తామని తెలిపారు. అసోసియేషన్ ద్వారా జూనియర్ న్యాయవాదులకు సేవలు అందించేలా చూస్తామని ఆయన అన్నారు. ఈ సందర్భంగా పలువురు న్యాయవాదులు అయనను ప్రత్యేకంగా అభినందించారు.

ప్రాణాపాయస్థితితో ఉన్న ఆవుకు జీవం

ఫోన్‌కాల్‌కు స్పందించిన వెటర్నరీ అధికారులు

జగిత్యాలరూరల్, జూన్ 10 : జగిత్యాల మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఫుడ్ పాయిజన్‌తో తీవ్ర అస్వస్థతకు గురై ప్రాణాపాయస్థితిలో కొట్టుమిట్టాడుతున్న ఆవును ఒక్క ఫోన్‌కాల్‌కు స్పందించిన వెటర్నరీ అధికారులు వైద్యం అందించి ప్రాణం పోశారు. వివరాల్లోకి వెళ్తే జగిత్యాల మండలపరిషత్ కార్యాలయ ఆవరణలో రెండు రోజుల నుంచి ఓ ఆవు ప్రాణాపాయస్థితిలో కొట్టుమిట్టాడుతోంది. ఇది గమనించిన స్థానికులు జిల్లా వెటర్నరీ అధికారులకు సమాచారం అందించారు. వెంటనే స్పందించిన జిల్లా వెటర్నరీ అధికారులు లక్ష్మీపూర్ వెటర్నరీ లైవ్‌స్టాక్ అధికారి పూర్ణచందర్, రిటైర్డ్ లైవ్‌స్టాక్ అసిస్టెంట్ భూమయ్యలను సంఘటన స్థలం వద్దకు పంపించి సకాలంలో వైద్యం అందించి ఆవును రక్షించారు. ఈసందర్భంగా వెటర్నరీ అధికారులకు స్థానికులు కృత జ్ఞతలు తెలిపారు. ఈకార్యక్రమంలో కౌన్సిలర్ పులి శ్రీధర్, సూపరిండెంట్ గంగాధర్, జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధి కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యం

కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కృష్ణారావు

కోరుట్ల రూరల్, జూన్ 10 : గ్రామాల అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని కాంగ్రెస్ సీనియర్ నాయ కుడు జువ్వాడి కృష్ణారావు అన్నారు. సోమవారం పట్టణం లోని మండలంలోని సంగెం గ్రామంలో నూతనంగా నిర్మాణం చేసిన బోరుబావి నిర్మాణంను పరిశీలన జరిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు మాట్లాడారు. గతంలో ఉన్న బీఆర్ ఎస్ ప్రభుత్వ గ్రామాల అభివృద్ధిని మరిచిందని కోరుట్ల నియోజకవర్గంలో మాజీ మంత్రి జువ్వాడి రత్నాకర్ రావు చేసిన అభివృద్ధినేనని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

'అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తే చర్యలు'

మెట్‌పల్లి, జూన్, 10 : ప్రభుత్వ అనుమతులు లేకుండా మట్టి, ఇసుకను తరలిస్తే చర్యలు తీసుకోబడునని మెట్‌పల్లి ఎస్సై చిరంజీవి హెచ్చరించారు. సోమవారం మండలంలోని సత్తక్కపల్లి శివారులోని వరుద కాలువ నుంచి అనుమతులకు విరుద్ధంగా మట్టిని తరలిస్తున్న టిప్పరు పట్టుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సత్తక్కపల్లి వరుద కాలువ నుంచి మట్టిని తరలించడానికి తీసుకున్న అనుమతులకు విరుద్ధంగా అధిక వాహనాలలో అక్రమంగా మట్టిని తరలిస్తున్న సమాచారం మేరకు దాడులు నిర్వహించామన్నారు. అనుమతి లేకుండా అక్రమంగా మెట్‌పల్లికి తరలిస్తున్న వాహనాన్ని పట్టుకుని రెవెన్యూ అధికారులకు అప్పగించామన్నారు.

ప్రభుత్వ నిబంధనల మేరకు తీసుకున్న అనుమతులకు లోబడి పనులు చేపట్టాలి. తీసుకున్న అనుమతులకు విరుద్ధంగా అధిక వాహనాల్లో మట్టి, ఇసుకను తరలిస్తే వాహనాలను సీజ్ చేసి చర్యలు తీసుకోబడునని హెచ్చరించారు.

బక్రీద్ పండుగను భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలి

జిల్లా అదనపు కలెక్టర్ రాంబాబు



సమీక్ష నిర్వహిస్తున్న అదనపు కలెక్టర్ రాంబాబు

జగిత్యాల, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో బక్రీద్ పండుగను భక్తి శ్రద్ధలతో సమన్వయంతో నిర్వహించుకోవాలని అదనపు కలెక్టర్ రాంబాబు అన్నారు. సోమవారం పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జిల్లాలో బక్రీద్ పండుగను భక్తి భావనతో ఎలాంటి సంఘటనలకు తావివ్వకుండా సామరస్యంగా నిర్వహించుకోవాలని అన్నారు. పండుగ వేళ ఎలాంటి వదందులు నమ్మకూడదని అన్నారు. పండుగ సందర్బంగా జంతు వధ స్లాటర్ హౌస్ లోనే చేయాలని, పశు సంవర్ధక అధికారులు జారీ చేసిన పశువులను మాత్రమే వదించాలని అన్నారు. వర్షాకాలం కావడంతో శానిటేషన్ పనులు ఎప్పటికప్పుడు నిర్వహించాలని, వ్యాధులు ప్రబలే అస్కారం ఉంటుందని తెలిపారు. ఈ సమావేశంలో డీఎస్పీ రవిందర్, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి వేణుగోపాల్, జిల్లా ట్రాన్స్‌పోర్టు అధికారి వంశీధర్, జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి ఆర్ఎస్ చిత్రు, మార్కెటింగ్ శాఖ అధికారి ప్రకాశ్, పలువురు మత పెద్దలు పాల్గొన్నారు.

19లోగా బీఎస్సీ ఆనర్స్ పరీక్ష ఫీజు చెల్లించాలి

గణేశ్‌నగర్, జూన్ 10: ఎస్‌యూ పరిధిలోని బీఎస్సీ ఆనర్స్ రెండు, నాలుగో సెమిస్టర్ విద్యార్థులకు పరీక్ష రుసుం చెల్లించడానికి ఎలాంటి అపరాధ రుసుం లేకుండా 19వ తేదీ వరకు గడువు ఉందని పరీక్షల నియంత్రాణాధికారి డాక్టర్ ఎన్‌వి శ్రీ రంగప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. 300 రూపాయల అపరాధ రుసుం తో 21వ తేదీ వరకు చెల్లించవచ్చని ఆయన తెలిపారు. పరీక్షలను జూలైలో నిర్వహించనున్నారు.

● ఎస్‌యూ పరిధిలోని ఎల్ఎల్‌బీ 2011-12 నుంచి 2019-20 వరకు అన్ని సెమిస్టర్ విద్యార్థులకు సప్లిమెంటరీ పరీక్షలు రాయడానికి ఈనెల 19వరకు ఫీజు చెల్లించాలని పరీక్షల నియంత్రాణాధికారి డాక్టర్ ఎస్ వి శ్రీ రంగ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. 300 రూపాయల అపరాధ రుసుంతో 21వ తేదీ వరకు తుది గడువు అని ఆయన తెలిపారు. పరీక్షలు జూలై లేదా ఆగస్టు నెలలో నిర్వహించనున్నారు.

'పొన్నంపై అసత్య ఆరోపణలు చేస్తే ఊరుకోం'

చిగురుమామిడి, జూన్ 10: బీసీ నేత, రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌పై అసత్య ఆరోపణలు చేస్తే ఊరుకోమని కల్లు గీత కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షుడు తాళ్లపెల్లి తిరుపతిగౌడ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. మంత్రి పొన్నం ప్రభాకర్‌పై ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి నిరాధార ఆరోపనణలు చేయడం సరికాదన్నారు. తప్పుడు ఆరోపణలు మానుకోకపోతే గౌడ సంఘాల ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడుతామన్నారు. ఇప్పటికైనా బీసీల పట్ల చిన్న చూపు చూడటం కౌశిక్ రెడ్డికి తగదన్నారు. సమావేశంలో జిల్లా గౌడ సంఘం నాయకులు తాళ్లపల్లి భాస్కర్‌గౌడ్, ముంజ వెంకన్న, బుర్ర శ్రీనివాస్, ఇల్లందుల రాములు, పచ్చిమట్ల లింగమూర్తి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

శంకరపట్నం, జూన్ 10: శంకరపట్నం మండలం రాజాపూర్ గ్రామ శివారులో సోమవారం బైక్ పైనుంచి పడి ఓ వ్యక్తి గాయపడ్డాడు. స్థానికుల సమాచారం మేరకు మండలంలోని ధర్మారం గ్రామానికి చెందిన దేవునూరి అనిల్ కేశవపట్నం వైపు నుంచి రాజాపూర్ మీదుగా ధర్మారం వస్తున్నాడు. ఈ క్రమంలో రాజాపూర్ శివారులో బైక్ అదుపు తప్పి చెట్టుకు ఢీకొట్టింది. ఈ ఘటనలో అనిల్‌కు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న 108 సిబ్బంది అనిల్‌కు చికిత్స అందించి హుజూరాబాద్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ద్విచక్ర వాహనం చోరీ.. కేసు నమోదు

ఎల్లారెడ్డిపేట, జూన్ 10: మండల కేంద్రంలోని గంప నాగేంద్రంకు చెందిన ద్విచక్ర వాహనం చోరీపై కేసు నమోదు చేశామని ఎస్సై రమా కాంత్ సోమవారం తెలిపారు. నాగేంద్రం తన బైక్‌ను ఈ నెల 5న స్థానిక బస్టాండ్ ప్రాంతంలో పార్క్ చేసి కిరాణా దుకాణానికి వెళ్లాడని, తిరిగి వచ్చి చూసేసరికి వాహనం కనిపించకుండా పోయిందన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

ప్రమాదవశాత్తు బావిలో పడి యువకుడి మృతి


అంజనేయులు మృతదేహం

సైదాపూర్, జూన్ 10: సైదాపూర్ మండలంలోని ఘణపూర్ తండాకు చెందిన బానోతు అంజనేయులు (18) ప్రమాదవశాత్తు బావిలో పడి మృతి చెందాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ఘణపూర్ తండాకు చెందిన బానోతు మోతీలాల్‌కు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడున్నాడు. కొడుకు అంజనేయులు డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఆదివారం రాత్రి 11 గంటలకు అంజనేయులు బహిర్భూమికి వెళ్లి వస్తానని చెప్పి వెళ్లాడు. అర్ధరాత్రి వరకు కూడా ఇంటికి రాకపోవడంతో తండ్రి మోతీలాల్ వెళ్లి ఎక్కడ వెతికినా కనబడలేదు. సోమవారం ఉదయం ఘణపూర్ గ్రామ శివారులోని రావుల చంద్రారెడ్డి వ్యవసాయ బావి వద్దకు వెళ్లి చూడగా ఆంజనేయులు సెల్‌ఫోన్, చెప్పులు బావి గడ్డపై కనబడ్డాయి. బావిలోని నీళ్లను కరెంటు మోటర్‌తో తీయగా అంజనేయులు మృతి చెంది కనిపించాడు. తన కొడుకు అంజనేయులు బహిర్భూమికి వెళ్లి ప్రమాదవశాత్తు కాలు జారి బావిలో పడి మృతి చెందాడని మృతుడి తండ్రి మోతీలాల్ ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ ఆరోగ్యం తెలిపారు.

నకిలీ పత్రాలు సృష్టించి భూ కబ్జాకు యత్నం



పట్టాదారు ఫిర్యాదుతో బయటపడిన వైనం

మున్సిపల్ రెవెన్యూ అధికారితో పాటు మరో ఇద్దరు రిమాండ్

పరారిలో కమిషన్‌తో పాటు కీలక వ్యక్తి

జగిత్యాల టౌన్, జూన్ 10: నకిలీ పత్రాలు సృష్టించి భూమి కబ్జాకు యత్నించిన ఐదుగురు వ్యక్తులపై జగిత్యాల పట్టణ పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. ఈ కేసులో మున్సిపల్ రెవెన్యూ అధికారితో పాటు మరో ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించి కమిషనర్‌తో పాటు కీలక వ్యక్తి పరారిలో ఉన్నట్లు పోలీసులు పేర్కొంటూ పూర్తి వివరాలు వెల్లడించారు. జగిత్యాల పట్టణంలోని హస్నాబాద్ శివారులోని 1599 సర్వే నెంబరులో 12 గుంటల భూమిని పట్టణానికి చెందిన కీర్తి విజయ లక్ష్మి, వుటూరి గీతారాణి, గొల్లపెల్లి సత్యనారాయణలు కొనుగోలు చేసి పూర్తి హక్కుదారులుగా ఉన్నారు.

ఈ భూమిని ఎలాగైనా కబ్జా చేయాలనే ఉద్దేశ్యంతో జిల్లా కేంద్రంలోని సుతారిపేటకు చెందిన ఖాజా అమిరుద్దీన్ అతని స్నేహితులు ముజాకిర్ అలీ, ఇమ్రాన్ అనే ముగ్గురు కలిసి సాదాబైనామాకు సంబంధించి నకిలీ ధ్రువ పత్రాలు 13-బి, 13-సితో పాటు మ్యాపును సృష్టించారు. ముగ్గురు కలిసి జగిత్యాల మున్సిపల్ కార్యాలయంలో రెవెన్యూ అధికారిగా పనిచేస్తున్న బడుగు ప్రసాద్‌తో పాటు మున్సిపల్ కమిషనర్ అనీల్‌తో కలిసి నకిలీ ఇంటి నంబరు, నకిలీ ఆస్తి అసెస్మెంట్ పత్రాలను సృష్టించారు. వీటి ద్వారా ఇంటి నంబరుకు వెకెంట్ ల్యాండ్ ట్యాక్స్ ఐడెంటిఫికేషన్ నంబరు కోసం 2012 అక్టోబరు నుంచి 2025 మార్చి 31 వరకు టాక్స్ కింద రూ. 97,500 చెల్లించి భూమిని కబ్జా చేసేందుకు పక్కాగా స్కెచ్ వేశారు. ఐదుగురు కలిసి కావాలని నేరపూరిత ఉద్దేశ్యంతో కుట్రపూరితంగా నకిలీ కాగితాలు సృష్టించి కబ్జాకు యత్నించిన భూమిని విక్రయించి వచ్చిన సొమ్మును ఐదుగురు కలిసి సమానంగా పంచుకునేలా కుట్రలు పన్నారు. తమ భూమిని కొందరు కబ్జాకు యత్నిస్తున్నారని తెలుసుకుని భూమికి పూర్తి హక్కు దారుగా ఉన్న కీర్తి విజయలక్ష్మితో పాటు మరో ఇద్దరు కలిసి కబ్జాదారులను అడ్డుకునే ప్రయత్నం చేశారు.

ఈ భూమి తమదేనని అన్ని ధ్రువ పత్రాలు ఉన్నాయని, వీఎల్‌టీ నంబరు కూడా ఉందని కబ్జాదారులు హక్కుదారులను బెదిరించారు. దీంతో కీర్తి విజయలక్ష్మి జరిగిన విషయాన్ని పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు 409, 420,461, 471, 468తో పాటు వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. దీంతో పోలీసులు సోమవారం మున్సిపల్ రెవెన్యూ అధికారి బడుగు ప్రసాద్ తో పాటు ఖాజా అమిరుద్దీన్, ముజాకిర్ అలీలను అరెస్టు చేసి కోర్టుకు తరలించినట్లు, మున్సిపల్ కమిషనర్ అనీల్‌తో పాటు ఇమ్రాన్ పరారీలో ఉన్నట్లు టౌన్ సీఐ వేణుగోపాల్ వివరించారు.

అత్యాచారయత్నం కేసులో మూడేళ్ల జైలు శిక్ష

సిరిసిల్ల క్రైం, జూన్ 10: పదేళ్ల బాలికపై అత్యాచారానికి యత్నించిన సిరిసిల్ల పట్టణంలోని రాజీవ్‌నగర్‌కు చెందిన కొండ రాహుల్(25)కు మూడేళ్ల జైలు శిక్ష, రూ.2వేల జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎన్. ప్రేమలత సోమవారం తీర్పు ఇచ్చారు. సిరిసిల్ల టౌన్ సీఐ రఘుపతి వివరాల ప్రకారం.. 2023లో సిరిసిల్లలోని వీధి లో పదేళ్ల బాలిక ఒంటరిగా వెళ్లగా రాహుల్ ఆమెపై అత్యాచారానికి యత్నించాడు. యువకుడి బారి నుంచి తప్పించుకున్న బాలిక ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులకు విషయం చెప్పింది. ఈ సంఘటనపై బాధితురాలి తల్లి సిరిసిల్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. వెంటనే ఆ యువకుడిపై అప్పటి సీఐ అనిల్ కుమార్ కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. ప్రాసిక్యూషన్ తరుపున స్పెషల్ పీపీ పెంట శ్రీనివాస్ వాదించారు. కోర్ట్ మానిటరింగ్ ఎస్సై రవీందర్ నాయుడు, కానిస్టేబుళ్లు మహేందర్, నరేందర్‌లు 13 మంది సాక్షులను కోర్టులో ప్రవేశ పెట్టారు. నేరం రుజువు కావడంతో రాహుల్‌కు 3 సంవత్సరాల జైలు, రూ2వేల జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి తీర్పు ఇచ్చారు.

కుక్కల దాడిలో వ్యక్తికి గాయాలు

కరీంనగర్ రూరల్, జూన్ 10: కరీంనగర్ రూరల్ మండలం దుర్శేడ్ గ్రామంలో సోమవారం కుక్కల దాడిలో మేడ శ్రీనివాస్ అనే వ్యక్తికి గాయాలయ్యాయి. గ్రామ పంచాయతీ అధికారులు స్పందించి వెంటనే కుక్కల బెడద నుంచి కాపాడాలని గ్రామస్థులు కోరుతున్నారు.

గంజాయి మత్తులో యువకుల హల్‌చల్

ఆటో డ్రైవర్‌ను ద్విచక్రవాహనంతో ఢీ, స్థానికులతో గొడవ


గాయపడిన రాజు

కోల్‌సిటీ, జూన్ 10: రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో రోజురోజుకు గంజాయి మత్తులో యువకుల ఆగడాలు పెరిగిపోతున్నాయి. సోమవారం సాయంత్రం గోదావరిఖని ప్రధాన చౌరస్తాలో ముగ్గురు ఆటో డ్రైవర్లు నిలుచొని మాట్లాడుతుండగా గంజాయి మత్తులో అతివేగంగా వచ్చి బండి రాజు అనే ఆటో డ్రైవర్‌ను మోటార్ సైకిల్‌తో ఢీకొట్టడంతో రాజు ఎగిరిపడి తీవ్ర గాయాలపాలయ్యాడు. గాయపడిన రాజును అటు ఇటూ తిప్పుతూ ఆ యువకులు ఇబ్బందులకు గురిచేశారు. విఠల్‌నగర్‌కు చెందిన సాయి, మహేష్ అనే ఇద్దరు యువకులు గంజాయి సేవించి గోదావరిఖని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ రోడ్డు నుంచి అతి వేగంగా వచ్చి రాజును ఢీకొట్టారు. స్థానికులు వారిని పట్టుకోగా వారిపైనే యువకులు తిరగబడడంతో పోలీసులు ఘటన స్థలానికి చేరుకోగా మోటార్ సైకిల్‌ను వదిలి పారిపోయారు. గాయపడిన బండి రాజును గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో చేర్పించి చికిత్స చేయిస్తున్నారు. అతని పరిస్థితి విషమంగా మారింది. ఘటన స్థలంలో పోలీసులు ఉన్నప్పటికీ ఆ యువకులను పట్టుకోవడం విఫలమయ్యారు.

పాము కాటుతో మహిళ మృతి

పెద్దపల్లి రూరల్, జూన్ 10: మండలంలోని రాగినేడు గ్రామానికి చెందిన పడాల రజిత (38) అనే మహిళ పాముకాటుతో మృతిచెందింది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం కుటుంబ సభ్యులతో నిద్రించగా ఆదివారం ఉదయం 2 గంటల ప్రాంతంలో గాఢనిద్రలో ఉన్న రజిత చేయికి పాము కాటు వేసింది. గమనించిన కుటుంబ సభ్యులు పెద్దపల్లి ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో కరీంనగర్ తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందినట్లు తెలిపారు. మృతురాలి భర్త పడాల వీరయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పెద్దపల్లి ఎస్ఐ లక్ష్మణ్‌రావు తెలిపారు. మృతురాలికి భర్తతో పాటు ముగ్గురు పిల్లలు ఉన్నారు.

భావితరాలకు ఉత్తమ విద్యార్థులను అందించాలి

శాతవాహన యూనివర్సిటీ రిజిస్ట్రార్ వరప్రసాద్



మాట్లాడుతున్న ఎస్‌యూ రిజిస్ట్రార్ వరప్రసాద్

కరీంనగర్ స్పోర్ట్స్, జూన్ 10: భావితరాలకు ఉత్తమమైన విద్యార్థులను అందించే బాధ్యత వ్యాయామ ఉపాధ్యాయుల చేతుల్లోనే ఉందని శాతవాహన యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వరప్రసాద్ అన్నారు. శాతవాహన యూనివర్సిటీ మైదానంలో సోమవారం తెలంగాణ ఫిజికల్ ఎడ్యుకేషన్ కామన్ ఎంట్రన్స్ టెస్టు శారీరక పరీక్షలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. బ్యాచ్‌లర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్, డిప్లొమా ఇన్ ఫిజికల్ ఎడ్యుకేషన్ కోర్సులను పూర్తి చేసి అభ్యర్థులు ఉత్తమ వ్యాయామ ఉపాధ్యాయులుగా ఎదగాలన్నారు. క్రమశిక్షణ గల భారతాన్ని నిర్మించడంలో వ్యాయామ ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమైందన్నారు.

అనంతరం పీసెట్ కన్వీనర్ రాజేశ్‌కుమార్ మాట్లాడుతూ యూనివర్సిటీ మైదానంలో అభ్యర్థులకు అన్ని సౌకర్యాలను కల్పించామన్నారు. ఈ సంవత్సరం రాష్ట్రం మొత్తం నుంచి 2,400 మంది పురుషులు, మహిళలు పీసెట్‌కు హాజరుకానున్నారని తెలిపారు. రోజుకు 600 మంది అభ్యర్థులను నాలుగు రోజులపాటు శారీరక పరీక్షలను నిర్వహించనున్నామన్నారు. మొదటిరోజు 478 మంది అభ్యర్థులు పాల్గొనగా వారికి శారీరక పరీక్షలను 100 మీటర్లు, 400 మీటర్లు, 800 మీటర్లు, షాట్‌పుట్, లాంగ్ జంప్, హై జంప్‌తో పాటు వివిధ రకాల క్రీడాంశాలలో నైపుణ్యాలను పరీక్షించారు. రిజిస్ట్రార్ వరప్రసాద్ అతిథులతో కలిసి జెండా ఊపి 100మీటర్ల పరుగు పందెంను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ పీడీ జె ప్రభాకర్‌రావు, శాతవాహన యూనవర్సిటీ స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి డాక్టర్ నజిమొద్దీన్ మునవర్, ఫిజికల్ డైరెక్టర్లు విజయ్‌కుమార్, శ్రీధర్‌రావు, నాగేశ్వర్‌రావు, పి శ్రీనాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


800 మీటర్ల పరుగులో పాల్గొంటున్న పీసెట్ అభ్యర్థులు

నంది రిజర్వాయర్‌లో తగ్గిన నీరు


నంది రిజర్వాయర్‌లో తగ్గిన నీటి మట్టం

ధర్మారం, జూన్ 10: ధర్మారం మండలం నందిమేడారంలో గల నంది రిజర్వాయర్‌లో నీటి మట్టం తగ్గింది. ఈ రిజర్వాయర్‌లో నీటి మట్టం తగ్గడంతో కింది భాగంలో భూగర్భ జలాలు అడుగంటి పోవడంతో నీటి కోసం ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మార్చి నెలలో రైతులకు సాగు నీరు అందించేందుకు వేమునూర్ పంప్‌హౌస్ నుంచి ఎల్లంపల్లి పైపులైన్ ద్వారా నంది రిజర్వాయర్‌లో నీటి విడుదల చేశారు. దీంతో ఈ ప్రాంతంలోని వ్యవసాయ, గృహాల్లో ఉన్న బావుల్లో నీరు సమృద్ధిగా ఉండేది. అయితే ఇటీవల ఎండల తీవ్రత కారణంగా నంది రిజర్వాయర్‌లో నీరంతా అడుగంటి పోయింది. మొదటి రిజర్వాయర్‌లో కొంత నీరు ఉన్నప్పటికి చివరి వరకు నీరంతా అడుగంటి ఎడారిగా కనిపిస్తోంది. ఆశించిన స్థాయిలో వర్షాలు కురిస్తే తప్ప ఇక్కడ నీటి ఇబ్బందులు తొలగిపోయే అవకాశాలు లేవు. ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేద్దామన్నా అందులో కూడా నీరు లేదని అధికారులు చెబుతున్నారు. ఇక ఆశించిన స్థాయిలో వర్షాలు కురిస్తేనే నీటి సమస్యకు పరిష్కారం లభిస్తుందని ప్రజలు భావిస్తున్నారు.

ప్రమాదవశాత్తు చెరువులో పడి వ్యక్తి మృతి

ఎలిగేడు, జూన్ 10: ఎలిగేడు గ్రామానికి చెందిన కుదుదుల లచ్చయ్య(55)అనే సింగరేణి రిటైర్డ్ ఉద్యోగి ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందాడు. జూలపల్లి ఎస్సై శ్రీధర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఎలిగేడులో బర్లు కాసుకుంటూ జీవిస్తున్నాడు. మద్యానికి అలవాటు పడ్డాడు. ఆదివారం ఉదయాన్నే బర్లను తోలుకొని గ్రామ శివారులోని ఎర్రగుంట చెరువు పరిసరాల్లో కట్టేశాడు. తిరిగి సాయంత్రం సమయంలో బర్లను తోలుకొని రావడానికి చెరువు వైపు వెళ్లాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు చెరువుకట్టపై నుంచి జారీ చెరువులో పడి మృతి చెందాడు. మృతుడు లచ్చయ్య భార్య కుదుదుల భాగ్యలక్ష్మీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పేకాట కేసులో 13 ఏళ్లకు..

ఏయిర్‌పోర్టులో ఒకరి అరెస్టు

మల్యాల, జూన్ 10: పేకాట కేసులో పోలీసులు ఒకరిని 13 సంవత్సరాలకు అరెస్టు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. 2011లో పేకాట ఆడుతూ ఏడుగురు పోలీసులకు పట్టుబడ్డారు. అయితే ఈ కేసులో మల్యాలకు చెందిన హుస్సేన్ అనే వ్యక్తి విదేశాలకు వెళ్లాడు. కోర్టుకు హాజరు కాకపోవడంతో పోలీసులు విదేశాలకు వెళ్లాడని కోర్టుకు తెలిపారు. దీంతో లుక్ అవుట్ సర్క్యూలర్ జారీ చేశారు. శనివారం విదేశాల నుంచి ఇంటికి తిరిగివస్తుండగా హైదరాబాద్ ఏయిర్‌పోర్టులో ఇమిగ్రేషన్ పోలీసులు పట్టుకొని మల్యాల పోలీసులకు సమాచారం అందించారు. దీంతో సదరు వ్యక్తిని తీసుకువచ్చి సోమవారం కోర్టులో హాజరుపరిచినట్లు పోలీసులు తెలిపారు.

రాయపట్నంలో ఇసుక డంపులు సీజ్

ధర్మపురి, జూన్ 10: ధర్మపురి మండలంలోని రాయపట్నం గ్రామంలో మైనింగ్ శాఖ ఇన్‌స్పెక్టర్ ఎం. రవిందర్‌రావు, పోలీస్ హెడ్‌కానిస్టేబుల్ ఎండీ సలీమొద్దీన్, ఆర్ఐ రాజేంద్ర ప్రసాద్ సోమవారం సంయుక్తంగా దాడులు చేసి ఇసుక డంప్‌లను సీజ్ చేశారు. కొంత కాలం నుంచి కొందరు వ్యక్తులు గోదావరి నదిలో అక్రమంగా ఇసుకను తొలగించి దూర ప్రాంతాల్లో విక్రయించేందుకు పరిసర ప్రాంతాల్లో నిల్వ ఉంచారు. అందిన పక్కా సమాచారం మేరకు దాడులు చేసి అక్రమంగా నిల్వ ఉంచిన రూ 6 లక్షలు విలువ గల ఇసుక డంప్‌లను సీజ్ చేశారు. దీంతో ధర్మపురి చుట్టు పక్క గ్రామాల్లో కూడ అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుక డంపుల యజమానులు భయాందోళనలు చెందుతున్నారు.



రాయపట్నంలో అధికారులు దాడులు చేసి సీజ్ చేసిన ఇసుక డంప్‌లు

ఉద్యోగం ఇప్పిస్తానంటూ మోసం

● రూ.3లక్షలు తీసుకొని నకిలీ నియమాకపత్రం అందజేత

● ప్రజావాణిలో కలెక్టర్‌కు బాధితురాలి ఫిర్యాదు


భర్తతో కలిసి ప్రజావాణికి వచ్చిన కవిత

సుభాష్‌నగర్, జూన్ 10: జిల్లా ఆసుపత్రిలో జీఎన్‌ఎమ్ నర్స్‌గా (జనరల్ నర్సింగ్ మిడ్‌వైఫరీ) ఉద్యోగం ఇప్పిస్తామని రూ.3లక్షల రూపాయలు దండుకొని దొంగ నియామక పత్రాలు అందజేశారని బాధితురాలి సోమవారం ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం కొమరంభీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ (టి) నుంచి బతుకుదెరువు కోసం 13సంవత్సరాల క్రితం మౌల్కర్ కవిత-దిలీప్ దంపతులు నగరానికి వచ్చారు. దిలీప్ స్థానికంగా పాన్ టేలా నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. దిలీప్‌కు ఓ స్నేహితుని ద్వారా శంకరపట్నం మండలం తాడికల్ గ్రామానికి చెందిన మాచర్ల రాజయ్య అనే వ్యక్తి పరిచయం అయ్యాడు.

ఈ క్రమంలో జిల్లా ఆసుపత్రిలో జీఎన్‌ఎమ్ నర్స్‌గా ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మ బలికాడు. ఉద్యోగం కోసం 5లక్షల రూపాయలు ఇవ్వాలని చెప్పి ముందుగా 3లక్షలు తీసుకున్నాడు. చాలా రోజులుగా ఉద్యోగం గురించి బాధితులు అడుగుతుండడంతో కలెక్టరేట్ ఏవో, జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ నుంచి నకిలీ నియామక పత్రాలు ఇచ్చాడు. అనంతరం వారు ఉద్యోగంలో చేరేందుకు వెళ్లగా ఆ పత్రాలు నకిలీవి అని తేలింది. దీంతో వారు రాజయ్యను నిలదీశారు. అతడు తాను తీసుకున్న డబ్బుకు బాండు పేపర్ రాసిచ్చాడు. ఆ తర్వాత చాలా సార్లు రాజయ్యను డబ్బు ఇవ్వాలని ఒత్తిడి తీసుకువచ్చినా రేపు, మాపు అంటూ వాయిదాలు వేసుకుంటూ వచ్చాడు.

ఇటీవల అయనను డబ్బుల విషయంలో నిలదీయడంతో అసభ్య పదజాలంతో కులం పేరుతో దూషించడమే కాకుండా తమపై దాడికి ప్రయత్నించాడని బాధిత దంపతులు ఆరోపించారు. రాజయ్యపై చర్యలు తీసుకొని డబ్బులు ఇప్పించాలని కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు.

నిరుపయోగంగా క్రీడాప్రాంగణాలు

రూ. లక్షలు వెచ్చించినా ఫలితం శూన్యం

చిగురుమామిడి, జూన్ 10: చిగురుమామిడి మండలంలో 17 గ్రామాలు ఉండగా 16 గ్రామాల్లో లక్షలాది రూపాయలు ఖర్చు చేసి నిర్మించిన క్రీడాప్రాంగణాలు నిరుపయోగంగా మారాయి. ఉపాధి హామీ పథకం ద్వారా 1.లక్షల 90 వేల రూపాయల చొప్పున ప్రతి గ్రామంలో క్రీడాప్రాంగణం ఏర్పాటు చేశారు. మండలంలోని పీచుపల్లిలో స్థలం సమస్యతో క్రీడా ప్రాంగణం నిర్మించలేదు. 16 గ్రామాల్లో దాదాపు 30 లక్షల 40 వేల రూపాయలు ఖర్చు చేసి క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేశారు. కొన్ని గ్రామాల్లో బిల్లులు సక్రమంగా రాకపోవడంతో అసంపూర్తిగా పనులు చేసి వదిలేశారు. మరికొన్ని గ్రామాల్లో నామమాత్రంగా పనులు చేశారు. క్రీడా ప్రాంగణాలను ఉపయోగంలోకి తీసుకరావడానికి అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు కృషి చేయకపోవడంతో అవి నిరుపయోగంగా మారాయి. ఇప్పటికైనా అయా గ్రామాల్లో నిర్మాణం చేసిన క్రీడా ప్రాంగణాలను ఉపయోగంలోకి తీసుకురావాల్సిన అవసరం ఉంది. క్రీడాప్రాంగణాల్లో సౌకర్యాలు ఏర్పాటు చేసి పాఠశాలల విద్యార్థులకు క్రీడల్లో శిక్షణ ఇవ్వాలని ప్రజలు కోరుతున్నారు. అయా గ్రామాల ప్రత్యేక అధికారులు, మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు ప్రత్యేక కృషి చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

విద్యార్థులకు ఉపయోగపడేలా చేస్తాం

మిట్టపల్లి మల్లేశం, మండల ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు

చిగురుమామిడి మండలంలోని అన్ని గ్రామాల్లో గత ప్రభుత్వం క్రీడా ప్రాంగణాల నిర్మాణం చేపట్టింది. పూర్తి స్థాయిలో సౌకర్యాలు లేక అవి నిరుపయోగంగా ఉన్నాయి. ఇదే విషయంపై ఈ నెల 13న జరుగనున్న మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడి క్రీడా ప్రాంగణాలు విద్యార్థులకు అందుబాటులోకి వచ్చేలా కృషి చేస్తాం.



ఉల్లంపల్లి క్రీడాప్రాంగణం

పేదలకు ఇళ్ల స్థలాలు అందించేందుకు కృషి



ఇళ్ల స్థలాలను పరిశీలిస్తున్న ఎంపీపీ, అధికారులు

మల్యాల, జూన్ 10: మండలంలోని తాటిపల్లి శివారులో మల్యాల వాసులకు గత ఇరవై ఏళ్ల క్రితం స్థలాలు కేటాయించి పూర్తి స్థాయిలో అందించకపోవడంతో ఎదురుచూస్తున్న లబ్దిదారులకు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సహకారంతో వెంటనే స్థలాలు అందించి ఇళ్ల నిర్మాణాలకు గాను కృషి చేయనున్నట్లు ఎంపీపీ రవళి తెలిపారు. సోమవారం తహసీల్దార్ మునీందర్ ఆర్ ఐ తిరుపతి ఇతర రెవెన్యూ అధికారులు, లబ్దిదారులతో కలిసి పట్టాలు అందించిన స్థలాలను పరిశీలించారు. లబ్దిదారులకు అందించాల్సిన స్థలాలు, మౌలిక సదుపాయాలు, సౌకర్యాలు గుర్తించాలని త్వరలోనే ఎమ్మెల్యే పర్యటన నేపథ్యంలో ప్రతిపాదనలు అందించాలని రెవెన్యూ అధికారులకు సూచించారు. వారి వెంట నాయకులు శ్రీనివాస్, మ్యాక లక్ష్మన్, వంశీధర్, ప్రశాంత్ ఉన్నారు

వైద్యులు లాభాపేక్ష లేకుండా సేవ చేయాలి

ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే లక్ష్మణ్‌కుమార్

ధర్మపురి, జూన్ 10: వైద్యులు లాభాపేక్ష లేకుండా సేవ చేయాలని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. ధర్మపురి పట్టణంలోని పటేల్ చౌరస్తా వద్ద ఫిజియో థెరపిస్ట్ డాక్టర్ లక్ష్మి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆర్ఆర్ ఫిజియో థెరపి క్లినిక్ సెంటర్‌ను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్ మాట్లాడుతూ ధర్మపురి పట్టణంలో రోగులకు అందుబాటులో ఉండేలా ఫిజియో థెరపి క్లినిక్‌ను ఏర్పాటు చేసిన డాక్టర్ లక్ష్మి అభినందనీయురాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ సభ్యులు, ధర్మపురి మండల కాంగ్రెస్ అధ్యక్షులు సంగనభట్ల దినేష్, మున్సిపల్ కౌన్సిలర్ జక్కు పద్మ-రవీందర్, మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షులు వేముల రాజేష్, జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు చిలుముల లక్ష్మణ్ పాల్గొన్నారు. ఇదిలా ఉండగా ప్రభుత్వ విప్ జగతి ప్లేస్కూల్‌ను సందర్శించి సరస్వతి పూజల్లో పాల్గొన్నారు. నూతనంగా ఏర్పాటు చేసిన అదనపు తరగతి గదులను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ సతీష్, పవన్‌కుమార్, శ్రవణ్ పాల్గొన్నారు.

ఘనంగా రేణుకా ఎల్లమ్మ వార్షికోత్సవం



రేణుకా ఎల్లమ్మ ఆలయంలో హోమ కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

మెట్‌పల్లి, జూన్, 10 : పట్టణంలోని కొంగుబంగారంగా కొలిచే రేణుకా ఎల్లమ్మ ఆలయం వార్షికోత్సవాన్ని గౌడ కుల సంఘం ఆధ్వర్యంలో సభ్యులు ఘనంగా నిర్వహించారు. సోమవారం ఆలయంలోని అమ్మవారికి అభిషేకాలు, అలంకరణ, ప్రత్యేక పూజలు జరిపారు. గౌడ కుల సంఘం ఆధ్వర్యంలో పురోహితులు సభ్యులచే ప్రత్యేక పూజలు నిర్వహించినతంరం ప్రత్యేక పూజలు, హోమం, హారతి వంటి కార్యక్రమాలను జరిపించారు. పట్టణంలోని గౌడ కులస్థులు, భక్తులు అమ్మ వారిని దర్శించుకుని పూజలు జరిపారు. మంగళ వారం అమ్మవారికి సర్పించే బోనాల కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని నిర్వహకులు కోరారు. ఈ కార్యక్రమంలో గౌడ కుల సంఘం అధ్యక్షుడు పూదరి సుధాకర్‌గౌడ్, పూదారి నర్సాగౌడ్, పుల్ల చిన్నయ్య గౌడ్, పూదారి శ్యాంసుందర్‌గౌడ్, రాజేశ్వర్‌గౌడ్, సుఖేందర్‌గౌడ్, శ్రీకాంత్‌గౌడ్, ఏనుగందుల గోపిగౌడ్, పూదారి రామ్‌గౌడ్, ఆనంద్‌గౌడ్ పాల్గొన్నారు.

మోదీ ప్రమాణ స్వీకారాన్ని స్వాగతిస్తూ సంబరాలు



సంబరాలు జరుపుతున్న రైల్వే వాకర్స్ అసోసియేషన్ సభ్యులు

కోరుట్ల, జూన్ 10 : దేశ ప్రధానిగా మూడవ సారి నరేంద్ర మోదీ ప్రమాణ స్వీకారం స్వాగతిస్తూ సోమవారం పట్టణంలోని రైల్వే వాకర్ యూనియన్ ఆధ్వర్యంలో సంబరాలు జరిపారు. పట్టణంలోని రైల్వే స్టేషన్ సమీపంలో టపాసులను పెల్చి మిఠాయిలను పంపిణీ జరిపి వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ యూనియన్ సభ్యులు రాచమడుగు శ్రీనివాస్ రావు, తిప్పిరి గంగధర్, సతీష్ రావు, పోతుగంటి శ్రీనివాస్, రవీందర్, జమిందార్, బుజ్జి, బిఎస్ రావు, రాజేశ్వర్ రావు, తిరుమల్ గౌడ్, లింగమూర్తి, కిషన్ గౌడ్, రాజు, గుణాకర్, మనోహర్ రావులు పాల్గొన్నారు.

ఇంటింటి సర్వే పకడ్బందీగా నిర్వహించాలి



నార్సింహునిపేటలో సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీవో

పెగడపల్లి, జూన్ 10 : మిషన్ భగీరథ ఇంటింటి సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని పెగడపల్లి ఎంపీడీవో ఎ.శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. పెగడపల్లి మండలంలోని 23 గ్రామాలలో సోమవారం మిషన్ భగీరథ సర్వే పేరిట ప్రతి ఇంట నల్లా కనెక్షన్ ఉందా, ఉంటే తాగు నీటి సరఫరా ఉందా దానిని వినియోగిస్తున్నారా తదితర వివరాలు నమోదు ప్రక్రియ చేపట్టగా ఎంపీడీవో శ్రీనివాస్ రెడ్డి, ఎంపీవో మహేందర్ పరిశీలించారు. ఈ సందర్భంగా సర్వేలో అవకతవకలకు తావు లేకుండా నిర్వహించాలని సూచించారు. అలాగే అమ్మ ఆదర్శ పాఠశాలల్లో జరుగుతున్న పనులను పరిశీలించి, పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, కారాబార్ ఉన్నారు.

పోగొట్టుకున్న బ్యాగ్ అందజేత

తంగళ్లపల్లి, జూన్ 10: మూడు రోజుల క్రితం తంగళ్లపల్లి మండలం నేరెళ్ల గ్రామ శివారులోని రోడ్డుపై ఓ బ్యాగ్‌ను పోలీసులు కనుగొన్నారు. స్వాధీనం చేసుకున్న తంగళ్లపల్లి ఎస్సై సుధాకర్ బ్యాగు ఫొటోను సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేశారు. విషయం తెలుసుకున్న బ్యాగ్ పోగొట్టుకున్న బాధితుడు సిరిసిల్ల పట్టణం సిద్దుల వాడకు చెందిన మల్యాల శ్రీనివాస్ సోమవారం తంగళ్లపల్లి పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాడు. పోలీసులు అతడికి బ్యాగ్‌ను అందజేశారు. హైదరాబాద్ నుంచి సిరిసిల్లకు కారులో వస్తున్న క్రమంలో వాహనంపై ఉన్న బ్యాగు పడి పోయిందని బాధితుడు తెలిపారు.

వడ్డీలేని రుణాలు అన్నదాతకు అందని ద్రాక్షేనా..?

● వడ్డీల భారంతో రైతన్న సతమతం

● కాంగ్రెస్ సర్కారు కనికరించేనా?

కథలాపూర్, జూన్ 10 : అన్నదాత సుఖీభవ, రైతు లేనిదే రాజ్యం లేదు అనే నినాదాలు ఊదరగొడుతున్న ప్రభుత్వాలు దేశానికి పట్టెడన్నం పెట్టే అన్నదాతను విస్మరిస్తున్నారు. వడ్డీ లేని రుణాలు అందించి ప్రోత్సహిస్తామని ఇచ్చిన హామీలు నీటి మూటలుగానే మిగిలిపోతున్నాయి. సకాలంలో రుణాలు అందించడంలో విఫలమవుతుండగా ప్రైవేట్ వ్యక్తులను ఆశ్రయించి అధిక వడ్డీల భారంను భరించలేని దుస్థితి దాపురించింది. వడ్డీ లేని రుణాలు ఇస్తామని చెప్పి పదేళ్లు దాటుతున్నా ప్రభుత్వాలు పట్టించుకోక పోవడం పట్ల రైతాంగం తీవ్ర నిరసన వెలిబుచ్చుతున్నారు.

● 4 శాతం రాష్ట్ర వాటాకు మంగళం

రైతులు పొందిన పంట రుణంకు నాబార్డ్ నిబంధనల మేరకు 7 శాతం వడ్డీ చెల్లించాల్సి ఉంటుంది. ఇందులో 3 శాతం కేంద్రం, 4 శాతం రాష్ట్ర వాటాల కింద వడ్డీలు తిరిగి చెల్లిస్తామని గతంలో హామి ఇచ్చారు. అయితే కేంద్రం వాటా 3 శాతం రైతులకు అప్పుడప్పుడు అందుతున్నప్పటికీ రాష్ట్ర వాటా మాత్రం దశాబ్ద కాలం దాటుతున్నా అన్నదాత నోచుకోవడం లేదు. కేంద్ర సహకార బ్యాంకుల్లో రుణం పొందిన రైతులు ప్రతీ ఆరు మాసాలకోసారి వడ్డీ చెల్లిస్తుంటారు. వాణిజ్య బ్యాంకుల్లో ఏడాదికో సారి రుణాలు చెల్లించాల్సి ఉంటుంది. భూషణరావుపేట సొసైటీలో రు. 9 కోట్ల పంట రుణాలు, గంభీర్‌పూర్ విండోలో రు. 6.74 కోట్లు, సిరికొండ సొసైటీలో రు. 5.30 కోట్ల పంట రుణాలు రైతుల పొందారు. 4 శాతం చొప్పున చెల్లిస్తున్న వడ్డీ తో రైతాంగం లక్షలాది రూపాయలు నష్టపోవాల్సి వస్తోంది. గత సర్కారు వడ్డీ చెల్లించకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. కనీసం కొత్తగా ఏర్పడ్డ కాంగ్రెస్ సర్కారు కనికరిస్తే బాగుంటుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



భూషణరావుపేట సింగిల్ విండో కార్యాలయం

● వడ్డీలేని రుణాలు అందిస్తే రైతులకు మేలు

దాసరి గంగాధర్, సింగిల్ విండో చైర్మన్, గంభీర్‌పూర్



రకరకాల పంటలు పండించి దేశానికి అన్నం పెడుతున్న రైతులకు వడ్డీలేని రుణాలు అందించి ఆదుకోవాల్సిన అవసరం ఉంది. రైతులు పొందుతున్న రుణాలపై ప్రభుత్వాలే వడ్డీలు చెల్లిస్తే రుణభారం నుంచి విముక్తి కలుగుతుంది. రైతాంగం మరిన్ని కొత్త రకాల పంటలు పండించడానికి అవకాశం ఏర్పడుతుంది.

● దీర్ఘకాలిక రుణాలపై రిబేట్ అందించాలి

కొడిపల్లి గోపాల్‌రెడ్డి, బీజేపీ జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు



పంట రుణాలపైనే కాకుండా దీర్ఘకాళిక రుణాలపై కూడా రైతులకు రిబేట్ అందించాలి. గతంలో 1.5 శాతం రిబేట్ అందించిన ప్రభుత్వాలు ప్రస్తుతం నిలిపివేయడం దారుణం. వ్యవసాయ యాంత్రీకరణను ప్రోత్సహించడానికి ప్రభుత్వాలు రైతులకు సబ్సిడీపై యంత్రాలు అందించే ఏర్పాట్లు చేయాలి.

బ్రాహ్మణ సేవా పరిషత్ కార్యవర్గం ప్రమాణ స్వీకారం

కోరుట్ల, జూన్ 10 : కోరుట్ల పట్టణ బ్రాహ్మణ సేవా పరిషత్ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం సోమవారం పట్టణంలోని వాసవి కళ్యాణ భవనంలో జరిగింది. పట్టణ అధ్యక్షుడుగా ప్రమాణ స్వీకారం చేసిన పాలెపు రామకృష్ణ శర్మ (రాంశర్మ) మిగితా కార్యవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకరం చేయించారు. ప్రదాణ కార్యధర్శిగా కలకుంట్ల నితిన్ కుమార్, కోశాధికారిగా దండం రాజ స్వరాజు, ఉపాధ్యక్షులుగా బీర్నంది నరసింహాచార్య, బ్రహ్మణగారి కృష్ణాకుమార్, పాలెపు శివరామకృష్ణ, సంస్కృతిక విభాగం ప్రతినిధులుగా పాలెపు భరద్వాజ్ శర్మ, బ్రహ్మణగారి అరణ్ కుమార్ శర్మ, దేశ్‌ముఖ్ ఫణీంద్ర శర్మ, యువజన విభాగం ప్రతినిధిగా సేనాపతి అచార్య కృష్ణ చంద్ర, కార్యవర్గ సభ్యులుగా కంచర్ల మధు కృష్ణా ఆచార్య, దేగాం ప్రదీప్ శర్మ, నారంభట్ల శ్రీదర్ శర్మ, బస్వరాజు పూర్ణ చందర్ రావు, శాశ్వత వ్యవస్థాపక చైర్మన్ బ్రహ్మణగారి శంకర్ శర్మ, గౌరవ అధ్యక్షుడుగా సేనాపతి ప్రవీణ్ కుమార్‌లను ప్రమాణ స్వీకారం చేయించారు. క్రమశిక్షణ కమిటీ సభ్యులుగా నేరేళ్ల రామకృష్ణ శాస్త్రి, తత్వాజీ రాజేంద్ర ప్రసాద్, సకినవీటి సత్యరావులను నియమిస్తున్నట్లు అధ్యక్షుడు పాలెపు రామకృష్ణ శర్మ ప్రకటించారు. నూతనంగా ఎంపికయిన కార్యవర్గాన్ని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావుతో పాటు పట్టణంలోని వివిధ దేవాలయల అధ్యక్ష కార్యధర్శులు, వివిధ సంఘాల కార్యవర్గ సభ్యులు సన్మానించి అభినందించారు.



నూతన అధ్యక్షుడిని సన్మానిస్తున్న కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కృష్ణారావు

విద్యుత్‌షాక్‌తో రెండు పాడి గేదెలు మృతి

మల్లాపూర్, జూన్, 10 : మండలంలోని ముత్యంపేట గ్రామంలో విద్యుత్ షాక్‌తో రెండు పాడి గేదెలు మృతి చెందినట్లు పశుపోషకులు తెలిపారు. గ్రామానికి చెందిన తెలు శ్రీనివాస్, తెలు పెద్దిరాజాం అను రైతులకు చెందిన పాడి గేదలు విద్యుత్ ఘాతంతో సోమవారం మృతి చెందాయి. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం..రోజు మాదిరిగానే గేదెలు మోత కోసం గ్రామ శివారంలోకి రైతులు తీసుకెళ్లారు. మేత మేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై రెండు గేదెలు అక్కడికక్కడే మృతి చెందినట్లుగా బాధితులు తెలిపారు. చనిపోయిన ఒక్కొక్క గేదె విలువ సుమారు రూ. 80వేలు ఉంటుందన్నారు. పాడి సంపదే ఆదారంగా చేసుకుని జీవనం కొనసాగిస్తున్న రైతులు గేదెలు మృతి చెందడంతో తీవ్రంగా నష్టపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. నష్టపోయిన తమరిని ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని బాధిత రైతులు కోరుతున్నారు.

సర్వేను సక్రంగా నిర్వహించాలి

కోరుట్ల రూరల్, జూన్ 10 : గ్రామాలలో నిర్వహిస్తున్న మిషన్ భగీరథ సర్వేను సక్రంగా నిర్వహించాలని ఎంపీడీఓ రామకృష్ణ గ్రామస్థాయి అధికారులకు సూచించారు. మండలంలోని వివిధ గ్రామాలలో మిషన్ భగీరథ పథకంలో ఇంటింటి నల్ల నీటి కులాయి కనెక్షన్ సర్వేను ఆర్‌డబ్ల్యుఎస్ ప్రత్యేక అధికారి శ్రీనివాస్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామస్థాయి అధి కారులకు ఎంపీడీవో సూచనలు సలహాలను అందించా రు. గ్రామస్థాయి అధికారులు పాల్గొన్నారు.

ఆగని తేనె టీగల దాడి

చందుర్తి, జూన్ 10 : చందుర్తి మండల కేంద్రంలోని పెట్రోల్ బంక్ సమీపంలో రెండవ రోజు తేనెటీగలు దాడి చేశాయి. కోరుట్ల వేములవాడ ప్రధాన రహదారిలో పెట్రోల్ బంక్ సమీపంలో రావిచెట్టుపై గల తేనెటీగలు రెండు రోజులు నుంచి లేచి రహదారిపై వెళ్తున్న ద్విచక్ర వాహ నాలతో పాటు, సైకిల్‌పై వెళ్తున్న వారిపై దాడులు చేస్తున్నా యి. దీంతో ద్విచక్ర వాహనదారులు కింద పడి గాయ పడ్డారు. కొంతమంది గ్రామస్థులు తేనెటీగల దాడి నుండి తప్పించుకోవడం కోసం దుప్పట్లు కప్పుకుని పరుగులు తీశారు. తేనెటీగల దాడిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు ప్రజావాణిలో తహసీల్దార్ శ్రీనివాస్‌కు ఫిర్యాదు చేశారు.

కొండగట్టు అంజన్నకు కమలాభిషేకం



ఆలయంలో పూజలు చేస్తున్న నాయకులు

మల్యాల, జూన్ 10: ప్రధానిగా మోదీ మూడవ సారి భాద్యతలు చేప ట్టడమే కాకుండా కేంద్ర మంత్రులుగా కరీంనగర్, సికింద్రాబాద్ ఎంపీలు నియమితులవ్వడంతో బీజేపీ నాయకులు సోమవారం కొండగట్టు ఆంజనేయ స్వామికి కమలం పువ్వులతో అభిషేకం చేశారు. స్వామి వారి మూలవి రాట్టు ను బీజేపీ ఎంపీల సంఖ్య అయిన 241 క మలం పువ్వులతో అలంకరించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో పార్టీ గణనీయంగా పుంజుకుందని రా బోయో రోజుల్లో ఇక్కడ అధికారంలోకి రావడం ఖాయమని అన్నారు. బీజేపీ నాయకులు మద్రిపల్లి సత్యం, శ్రావన్‌కుమార్, మల్లేశం, రవి, చక్రం గౌడ్, ఆనందం, శ్రీనివాస్, మహేష్, వేణు, సత్యం, నరేంధర్, మహిసాల్‌రెడ్డి పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి




వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న ఉప వైద్యాధికారి

జిల్లా ఉప వైద్యాధికారి శ్రీనివాస్

వెల్గటూర్, జూన్ 9: సీజనల్ వ్యాధుల పట్ల ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఉప వైద్యాధికారి శ్రీనివాస్ ఆదేశించారు. సోమవారం వెల్గటూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఆరోగ్య కేంద్రంలో వివిధ రికార్డులు పరిశీలించారు. మందుల స్టాక్ వివరాలు పరిశీలించారు. రాబోయే సీజన్‌లో వచ్చే డెంగ్యూ జ్వరం, నీళ్ల విరేచనాలు, టైఫాయిడ్ జ్వరం వంటి వాటిని ఎదుర్కొనేందుకు సరిపడా మందులు ఉన్నాయా? లేవా? అని ఆరా తీశారు. ల్యాబ్‌లో టెస్టులు గురించి ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి శ్రావణ్ కుమార్, సీహెచ్‌వో జగన్నాథం, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

ఐఎల్‌పీఏ కార్యవర్గం ఎంపిక

కోరుట్ల, జూన్ 10 : ఇండియన్ లీగల్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు అసోసియేషన్ సభ్యులు తెలిపారు. సోమవారం పట్టణంలోని సి. ప్రభాకర్ భవనంలో ఇండియన్ లీగల్ ప్రొఫెషనల్ అసోసియేషన్ జిల్లా ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసుకోని కార్యవర్గం ఎన్నుకున్నట్లు అసోసియేషన్ రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ దయ్యా రాజరాం, రాష్ట్ర కమిటీ సభ్యులు మెడిచెలిమెల సుమలత తెలిపారు. జిల్లా అధ్యక్షుడుగా మగ్గిడి నర్సయ్య, ఉపాధ్యక్షుడుగా యండి ఫసియొద్దిన్, జనరల్ సెక్రటరీ కుంచాల రామకృష్ణ, జాయింట్ సెక్రటరీగా జాజాల రమేష్, కోశాధికారిగా గుగ్గిల్ల రాజేందర్, అర్గనైజింగ్ సెక్రటరీగా నీరటి రమణ, గౌరవ సభ్యులుగా చెన్న విశ్వనాథం, వోటరికారి శ్రీనివాస్, ఉమ, దీప, రమేష్, సత్యనారాయణలు ఎకగ్రీవంగా ఎంపికైనట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా నూతనంగా ఎంపికయిన సభ్యులను సన్మానించి అభినందించారు.



సమావేశం అయిన అసోసియేషన్ సభ్యులు

చౌడాలమ్మ ఆలయంలో ప్రభుత్వ విప్ ప్రత్యేక పూజలు

గొల్లపల్లి, జూన్ 10 : ఈ యేడు వర్షాలు పుష్కలంగా కురిసి, పంటలు సంవృద్ధిగా పండాలని, పిల్లాపాప, గొడ్డుగోదా అందరిని సల్లంగా చూడు చౌడలమ్మ తల్లి అంటూ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మన్ కుమార్ వేడుకున్నారు. గొల్లపల్లి మండలం రాఘవపట్నం గ్రామంలో జరుగుతున్న చౌడలమ్మ తల్లి పట్నాల మహోత్సవంలో భాగంగా అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆదివారం చౌడలమ్మ తల్లిని దర్శించుకున్నారు. రజక సంఘం ఆధ్వర్యంలో లక్ష్మణ్ కుమార్‌కు కాంగ్రెస్ పార్టీ స్థానిక నాయకులు, కార్యకర్తలు, కుల సంఘం పెద్దలు పూర్ణాకుంభాభి షేకంతో ఘన స్వాగతం పలికారు. లక్ష్మణ్ కుమార్‌కు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం లక్ష్మణ్‌కుమార్ మాట్లాడుతూ గ్రామ దేవతల ఆలయాల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఆనాదిగా వస్తున్న ఆచార సంప్రదాయాలను గౌరవిస్తూ కుల దేవతలను కొలవాలని సూచించారు. అప్పుడే రాష్ట్రం అన్ని రంగాల్లో సుభిక్షంగా ఉండి ప్రజలు సుఖసంతోషాలతో వర్ధిల్లుతారని పేర్కొన్నారు.

●గొల్లపల్లి మండలంలో శ్రీరాముల పల్లె గ్రామంలో నిన్న మధ్యాహ్నం తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ కార్యకర్త బాలే లక్ష్మయ్య కుటుంబ సభ్యులను ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పరామర్శించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపి ప్రభుత్వ పరంగా అన్ని విధాలుగా బాధిత కుటుంబానికి అండగా ఉంటామని భరోసానిచ్చారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులకు తన వంతుగా ఆర్థిక సాయం అందించి అండగా నిలిచారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.



ఆలయంలో పూజలు చేస్తున్న ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

మల్యాల, జూన్ 10: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య లభిస్తుందని చిన్నారులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఎంపీపీ రవళి అన్నారు. మల్యాలలో సోమవారం నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బడీడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఉచిత పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్కులు, దుస్తులు అందిస్తామని అన్నారు. అనంతరం ఉపాధ్యాయులతో కలిసి ర్యాలీ చేశారు. మండల విద్యాధికారి అయిత శ్రీనివాస్ ఉపాధ్యాయులు, ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్లు, స్వశక్తి మహిళలు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలి

పెగడపల్లి, జూన్ 10 : బడీడు పిల్లలందరిని ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని కోరుతూ ఉపాధ్యాయులు ఇంటింట తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. బడిబాట కార్యక్రమంలో బాగంగా సోమవారం ఉపా ధ్యాయులు ఇల్లిల్లూ తిరుగుతూ ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న వసతులు, ఉచిత పాఠ్యపుస్తకాలు, మధ్యాహ్న బోజనం, యూనిఫామ్స్ లాంటి సౌకర్యాలతో పాటు నాణ్యమైన విద్యా బోదన గూర్చి వివరిస్తూ తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తూ ప్రచారం చేశారు.

రేపు అర్బన్ మండలపరిషత్ సర్వసభ్య సమావేశం

జగిత్యాలరూరల్, జూన్ 10 :జగిత్యాల అర్బన్ మండల ప్రజాపరిషత్ సమావేశం ఈ నెల 12న ఎంపీపీ ములాసపు లక్ష్మీ అధ్యక్షతన ఉదయం 11 గంటలకు జగిత్యాల మండలపరిషత్ సమావేశమందిరంలో నిర్వహించబడునని జగిత్యాల ఎంపీడీవో విజయలక్ష్మీ తెలిపారు. మండలసభ్యులు, అధికారులు సకాలంలో హాజరుకావాలన్నారు.

ఎన్‌హెచ్‌ఎం కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ అధ్యక్షురాలిగా పద్మ

జగిత్యాల, జూన్ 29, (ఆంధ్రజ్యోతి) : ఎన్‌హెచ్‌ఎం కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ జిల్లా అధ్యక్షురాలిగా బాలె పద్మ సోమవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గౌరవ అధ్యక్షుడిగా వెన్నమహేష్, చీఫ్ అడ్వైజర్‌గా సుతారిరాములు, ప్రధానకార్యదర్శిగా సింగం మాధురి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు జాతీయ ఆరోగ్య మిషన్ కాంట్రాక్ట్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నరసింహ తెలిపారు.

సమస్యను పరిష్కరించాలని రైతు ఆందోళన

సిరిసిల్ల రూరల్, జూన్ 10: తన వ్యవసాయ భూమిలో లూజ్ వైరింగ్ ఉందని, ఆ సమస్యను పరిష్కరించాలని తంగళ్లపల్లి మండలం రామచంద్రాపూర్‌కు చెందిన గంధం రమేష్ సోమవారం సిరిసిల్ల సెస్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టాడు. రామచంద్రాపూర్ శివారులో రమేష్‌కు ఎకరం 20 గుంటల వ్యవసాయ భూమి ఉంది. అందులో విద్యుత్ స్తంభాలకు ఉన్న తీగలు కిందికి వేలాడుతున్నాయి. తరచూ తీగలతో వ్యవసాయానికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అధికారులు నిర్లక్ష్యం చేయడంతో పాటు లూజ్ వైరింగ్‌ను సవరించేందుకు మిడిల్ పోల్‌ను వేయాలని అందుకు డబ్బులను చెల్లించుకోవాలని చెప్పడంతో ఆగ్రహించిన రమేష్ కార్యాలయం ఎదుట బైఠాయించాడు. సమస్యకు పరిష్కారం చూపాలని ఆందోళనకు దిగాడు.

నీట్ ఫలితాలపై విచారణ చేపట్టాలి

గంభీరావుపేట, జూన్ 10 : నీట్-2024 ఫలితాలపై వెంటనే విచారణ చేపట్టాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు గాంతుల మహేష్ డిమాండ్ చేశారు. గంభీరావుపేట మండల కేంద్రంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. నీట్ నిరవ్హణపై విద్యార్థుల తల్లిదండ్రులు నుంచి అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయన్నారు. నీట్ నిర్వహణపై సమగ్ర విచారణ చేపట్టాలన్నారు. పరీక్ష నిర్వహణ బాధ్యత చేపట్టిన ఎన్‌టీఏ వ్యవహరించిన తీరుపై దేశ వ్యాప్తంగా అభ్యంతరాలు వ్యక్తం అవుతున్నాయన్నారు. ఎన్‌టీఏ పారదర్శకత పరీక్ష నిర్వహణపై ప్రత్యేక దర్యాప్తు సంస్థలతో న్యాయ విచారణ చేపట్టాలన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. దేశ వ్యాప్తంగా 24 లక్షల మంది విద్యార్థుల జీవితాలతో ఈ అంశం ముడిపడి ఉందని, తక్షణమే పూర్తి స్థాయిలో విచారణ చేపట్టాలని అన్నారు. దీనికి కేంద్ర ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలన్నారు.

ప్రజాస్వామ్యాన్ని రక్షించాలి

వేములవాడ టౌన్, జూన్ 10 : రాజ్యాంగాన్ని, ప్రజా స్వామ్యాన్ని పరిరక్షించేందుకు నేటి తరం నడుంబిగించాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు భూపాల్ అన్నారు. వేములవాడ పట్టణంలో చేపట్టిన జిల్లా స్థాయి రాజకీయ శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమానికి సోమవారం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. భూపాల్ మాట్లా డుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం పదేళ్ల అధికారంలో ఉండి దేశ ప్రజలకు ఇసుమంత మేలు కూడా చేయలేదని మండిపడ్డారు. బీజేపీ ప్రభుత్వాన్ని ప్రశ్నించిన వారిని దేశ ద్రోహులుగా చిత్రీకరిస్తూ అనేక మంది హేతువాదులను, జర్నలిస్టులను మేధావులను పొట్టనపెట్టుకుందని ఆవేధన వ్య క్తం చేశారు.

బాధితులకు న్యాయం చేస్తాం

సిరిసిల్ల క్రైం, జూన్ 10: భూ, ఆస్తి తగాదాల విషయంలో నిబంధనల ప్రకారం నడుచుకుంటామని, బాధితులకు న్యాయం చేస్తామని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో గ్రీవెన్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా 15 ఫిర్యాదులు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రీవెన్స్ డే ఫిర్యాదులు ఏ మేరకు పరిష్కారం అయ్యాయో ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ ప్రజలకు మరింత సమర్థవంతంగా సేవలు అందిస్తామన్నారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ నిర్వహిస్తూనే అసాంఘిక శక్తులు, నేరస్థులపై కఠిన వైఖరి అవలంబిస్తామన్నారు.